# 1,200 కోట్లతో రోడ్ల మరమ్మతులు

- పురోగతిలో మరో రూ.1,300కోట్ల పనులు
- జనవరి నాటికి పూర్తిచేయాలని లక్ష్యం
- వివిధ కారణాలతో 129 పనుల్లో జాప్యం



హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రయాణం మరింత సౌకర్యంగా మార్చేందుకు నడుంబిగించిన ఆర్‌అండ్‌బీ అధికారులు విస్తృతంగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మండల కేంద్రాలను కలిపే రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలంలో కొట్టుకుపోయిన రోడ్ల మరమ్మతు పనులు ఇప్పటికే 50 శాతం పూర్తయ్యాయి. దాదాపు రూ.1,200 కోట్ల పనులు పూర్తికాగా, మరో రూ.1,300కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. వచ్చే ఏడాది జనవరి చివరినాటికి పనులన్నీ పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 2,500కోట్లు కేటాయించింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో రోడ్ల మరమ్మతులకు రూ. 1,823కోట్లు, కల్వర్టుల కోసం రూ. 544కోట్లు కలుపుకొని మొత్తం రూ. 2,367కోట్లు ఖర్చవుతుందనే అంచనాతో అధికారులు పనులు చేపట్టారు. వర్షాలు, వరదల వల్ల రాష్ట్రవ్యాప్తంగా పాత ఆర్‌అండ్‌బీ సర్కిళ్ల పరిధిలో మొత్తం 6,641కిలోమీటర్లమేర రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందులో రోడ్ల మరమ్మతుల కోసం మొత్తం 1,170 పనులను మంజూరు చేయగా, వీటిలో దాదాపు 600 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో 450 పనులు పురోగతిలో ఉన్నాయి. కరీంనగర్‌లో అత్యధికంగా 174 పనులు, వరంగల్‌లో 162, నల్గొండలో 138, ఖమ్మంలో 134 పనులు చేపట్టగా ఈ నాలుగు జిల్లాల్లో పనులు దాదాపు 60శాతం, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, రూరల్ రీజియన్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో 35 శాతం వరకు పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

### వర్షాల కారణంగా జాప్యం

వర్షాల కారణంగా మరమ్మతు పనుల్లో జాప్యం జరిగినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనుల్లో వేగం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే 50 శాతానికిపైగా పనులు పూర్తికాగా, మరో 450 పనుల్లో చాలావరకు తుదిదశకు చేరుకున్నట్టు తెలిపారు. ఇందులో సగానికిపైగా పనులు మరో నెల రోజుల్లో పూర్తవుతాయని పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల 129 పనులు చేపట్టడంలో జాప్యం చోటుచేసుకున్నదని, ప్రస్తుతం ఈ పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. మొత్తం పనులన్నీ వచ్చే ఏడాది జనవరి చివరికల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు.

**రోడ్డు మరమ్మతు పనుల పురోగతి ఇలా..**

| జిల్లా | మంజూరు | పూర్తి | పురోగతిలో |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 89 | 25 | 37 |
| కరీంనగర్ | 174 | 110 | 78 |
| వరంగల్ | 162 | 96 | 71 |
| ఖమ్మం | 134 | 84 | 33 |
| నిజామాబాద్ | 122 | 42 | 44 |
| మహబూబ్‌నగర్ | 123 | 46 | 46 |
| నల్లగొండ | 138 | 65 | 63 |
| సంగారెడ్డి | 131 | 84 | 47 |
| రూరల్ రీజియన్ | 97 | 39 | 31 |
| మొత్తం | 1170 | 591 | 450 |

**రోడ్లు, కల్వర్టుల మరమ్మతు పనుల వివరాలు**

- ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు: రూ. 2,500 కోట్లు
- మొత్తం పనుల అంచనా వ్యయం: రూ.1,823.40 కోట్లు
- మంజూరైన రోడ్ల పనులు: 1,170
- పూర్తయిన పనులు : 591
- పురోగతిలో ఉన్నవి : 450
- టెండర్ల దశలో ఉన్నవి :129

## మాట నిలబెట్టుకున్న సీఎం.. సొంతింటికి పూర్ణ



*సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ఎవరెస్టు అధిరోహించిన మాలావత్ పూర్ణ ఇంటి కలను సాకారం చేశారు. కామారెడ్డిలోని ఎల్లమ్మ ఆలయం ఎదురుగా 300 గజాల స్థలంలో రూ.47 లక్షలతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇంటిని శుక్రవారం ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ప్రారంభించారు.* **– కామారెడ్డి**

## టీచర్ల కోసం ప్రత్యేక విధానం తేవాలి : టీఎస్‌జీహెచ్‌ఎంఏ

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): విద్యారంగంలో కేజీ టు పీజీ విధానాన్ని ప్రకటించినట్టుగానే టీచర్ల కోసం ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల అసోసియేషన్ (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ శుక్రవారం బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పక్షనేత కేశవరావును కలిసి వినతిపత్రం అందజేశారు.

# బతికొస్తవనుకోలేదు కొడుకా!

- *17 ఏండ్ల తర్వాత దుబాయ్ జైలు నుంచి విముక్తి*
- *15 లక్షలు చెల్లించి విడిపించిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్*
- *స్వగ్రామానికి చేరిన లక్ష్మణ్*
- *కుటుంబ సభ్యుల భావోద్వేగం*



కుటుంబసభ్యులతో లక్ష్మణ్ (సర్కిల్‌లో)

*కోనరావుపేట, అక్టోబర్ 6:* ఉపాధి వేటలో దుబాయ్ బాట పట్టిన యువకుడు ఓ హత్య కేసులో చిక్కుకొని 17 ఏండ్లు జైలు శిక్ష అనుభవించాడు. మంత్రి కేటీఆర్ చొరవతో ఎట్టకేలకు ఇంటికి చేరాడు. కొడుకును చూసి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. 'బతికొస్తవనుకోలేదు కొడుకా.. నీ పాణం ఎట్లున్నది బిడ్డా' అంటూ తల్లి కన్నీళ్లపర్యంతమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన దండుగుల నర్సయ్య, లస్మవ్వ దంపతులకు కొడుకు లక్ష్మణ్ ఉపాధి కోసం 2004లో దుబాయ్ వెళ్లాడు. అక్కడ నేపాల్‌కు చెందిన ఓ సెక్యూరిటీ గార్డు హత్య కేసులో ఇరుక్కుపోయి జైలుకు వెళ్లాడు. ఇతడితోపాటు సిరిసిల్ల మండలం పెద్దూరుకు చెందిన శివరాత్రి రవి, శివరాత్రి మల్లేశ్, శివరాత్రి హనుమంతు, గొల్లె నాంపెల్లి మరో నలుగురు శిక్ష అనుభవిస్తున్నారు. గతంలో మంత్రి కేటీఆర్ దుబాయ్ పర్యటనకు వెళ్లినప్పుడు బాధితుల క్షమాభిక్ష కోసం షరియా చట్టం ప్రకారం రూ.15 లక్షలు చెల్లించారు. నేర తీవ్రత దృష్ట్యా అక్కడి అధికారులు వీరిని విడుదల చేయలేదు. ఇటీవల మంత్రి కేటీఆర్ స్వయంగా దుబాయ్ వెళ్లి అక్కడి అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడారు. ఇందులో కోనరావుపేటకు చెందిన లక్ష్మణ్ అనారోగ్యంతోపాటు తదితర కారణాల రీత్యా న్యాయవాది అభ్యర్థన మేరకు విడుదలకు ఆమోదం తెలిపారు. దీంతో శుక్రవారం ఇండియన్ ఎంబసీ అధికారులు స్వయంగా హైదరాబాద్‌లో లక్ష్మణ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానసిక సమస్యతో బాధపడుతున్న లక్ష్మణ్ సురక్షితంగా ఇంటికి చేరాడు. తల్లి లస్మవ్వను చూసి కంటతడిపెట్టాడు. మంత్రి కేటీఆర్ దేవుడిలా వచ్చి లక్ష్మణ్‌ను ఇంటికి చేర్చాడని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### 27 మంది అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఉన్నత విద్యాశాఖలో పనిచేస్తున్న 27 మంది సీనియర్ అధ్యాపకులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పదోన్నతుల పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (టీజీసీటీఏ) అధ్యక్షులు డాక్టర్ సంగి రమేశ్, కార్యదర్శి డాక్టర్ బ్రిజేశ్, చైర్మన్ డాక్టర్ విజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.








